అతణ్ణి
చంపుతానని
బెదిరించిన
ఆ హంతకుడెవరు?

# ప్రాణం కోసం

బద్దిగం పాండురంగా రెడ్డి

"హలో సుందరరామయ్య స్పీకింగ్... ఆ ఎవరూ? అంటూ రిసీవరెత్తి మాట్లాడిన సుందరరామయ్య, అవతలివైపునుంచి వినిపించిన మాటలకు స్థాణువులా నిలిచిపోయాడు.

"నువ్వు అరగంటలో చస్తావు" అంతే, ఆ మాటలని అవతలివైపు వ్యక్తి రిసీవర్ క్రెడిల్ చేశాడు.

వణుకుతున్న చేతులతో రిసీవర్ పెట్టేశాడు సుందరరామయ్య.

"ఎవరు నాకు ఇలా ఫోన్ చేస్తారు. పైగా చంపుతానంటున్నాడు. ఎవరబ్బా... ఒకవేళ నా ద గ్గర అప్పుతీసుకుని వడ్డీలే తీర్చలేక బాధపడేవాళ్లలో ఎవరైనా కావచ్చును"


ఈ మధ్యనే ఆ బీద పంతులు జానకిరామయ్యని ఇల్లు తాకట్టుపెట్టి తీసుకున్న డబ్బు వడ్డీతో సహా తీర్చమని తను బలవంతం చేశాడు. ఆ పంతులు గడువు అడిగినా ఇవ్వకుండా తను బలవంతంగా అతన్ని, అతని కుటుంబాన్ని ఆ ఇంట్లోంచి వెళ్లగొట్టించాడు.

ఒకవేళ ఆ పంతులే తనకు ఫోన్ చేశాడా? ఏమో! గొంతుమాత్రం అతనిదిలా లేదు. ఏదో అడ్డం పెట్టుకుని మాట్లాడుతున్నట్లు అనిపించింది.

ఆ... బతకలేని బడిపంతులు! అంత ధైర్యంగా తనకు ఫోన్ చేయగలడా? పైగా ఆ పంతులు హైదరాబాద్‌లోని తన కొడుకుల దగ్గరికి చేరినట్లు నిశ్చయంగా తెలిసింది. కాబట్టి అతనై వుండడు.

ఒకవేళ పక్కింటి పార్వతీశంగాడేమో!

ఆ వాడే అయ్యుంటాడు. ఒకసారి వాడు



ఇంట్లో లేనప్పుడు వాడి భార్యని రేప్ చేయాలని ప్రయత్నించాడు తను. వాడి పెళ్లాం వేసిన కేకలకి పక్కింటివాళ్లు లేచి రావడంతో దొడ్డిగుమ్మంద్వారా బయటపడ్డాడు తను.

ఒకవేళ వాడేమైనా ఈ పని చేశాడా?

ఆ... వాడి మొహం. తలెత్తి తనవైపే సరిగా చూడలేని వాడికి తనకి ఫోన్ చేసి, చంపుతాన

ని బెదిరించేంతటి ధైర్యం వుంటుందా??

సుందర రామయ్య ఆలోచనలు ఇంకా ముందుకు సాగినై. అతని ఆలోచనల్లోకి ఎన్నో ఘట్టాలు, ఎందరో అతనివల్ల అన్యాయం చేయబడినవాళ్లు ప్రవేశిస్తున్నారు.

ఒకవేళ సీతాపతిగాడేమో! అవును. వాడే అయ్యుంటాడు. వాడు తన దూరపు బంధువు. వాడి చిన్నతనంలోనే వాళ్ల నాన్న చనిపోయాడు. పోతూ తనని సీతాపతికి, వాడి లక్షరూపాయల ఆస్తికి గార్డియన్‌గా నియమించి మరీ చచ్చాడు.

వాడి ఆస్తిమీద వచ్చే అయివేజు అంతా తను తిన్నాననీ, వాడి చదువుకి తనే మీ సొమ్ము ఖర్చుపెట్టలేదనీ, వాడి చదువుకోసం అమ్మేసిన పొలం తన పేరుతో ఉన్నట్లు వాడికి తెలుసుననీ ఇంకా ఏమోమో వాగాడు

ఆ సీతాపతి తను ఎంత నచ్చచెప్పినా వినలేదు. వాడికంటే వాళ్లమ్మే నయం. పాపం.. చచ్చి ఏ లోకాన వుందో ఏమో! తను ఎంత చేతిలో పెడితే అంతా మారు మాట్లాడకుండా తీసుకుని ఊరుకునేది ఆ ఇల్లాలు.

"ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములే వాడి" అంటారు. ఆ సామెతని అక్షరాలా నిజం చేశాడు ఈ సీతాపతిగాడు. లేకపోతే నిన్నగాక మొన్న తన కళ్లముందు పుట్టి పెరిగిన ఈ బొట్టికాయ, ఈ సీతాపతా తనని నిలదీసి అడిగేది!

"నా ఆస్తి అంతా తిన్నావు. ఇక మిగిలిన అదికూడా నువ్వే దిగ్రమింగు. నీ పాపం పండే రోజు వస్తుంది. ఆరోజు నాలాంటివాడెవడో నీ ప్రాణం తీసి, అంతకు అంతా వడ్డీతో సహా వసూలుచేస్తాడు. ఒకవేళ నేనే ఆ పని చేస్తానేమో" అంటూ ఆవేశంతో ఏమేమో వాగాడు సీతాపతి.

ఏదో కుర్రకుంక. ఆవేశం పట్టలేక వాగి వుంటాడు అని సరిపెట్టుకున్నాడుగానీ! ఇంత కసివాడి మనసులో ఇల్లు కట్టుకుని కూర్చున్నదని తను ఊహించనేలేదు.

వాడే అయ్యుంటాడు. నిష్కారణంగా తన ప్రాణాన్ని తీయబోతున్నాడు.

బయట పెద్ద గాలివాన కురుస్తున్నా సుందరరామయ్య ఒంటినిండా ముచ్చెమటలు పోశాయి. పక్కింటి పార్వతీశం వాళ్లు ఊళ్లో లేరు. తమ రెండిళ్లు కాక ఇంకొక నాలుగైదు ఇళ్లు వున్నాయి ఆ వీధిలో. అవన్నీ కొత్తగా ఊరిచివర ప్రశాంత వాతావరణంలో నిర్మింపబడినవి.

తను పిలిచినా ఆ ఇళ్లవాళ్లు సహాయంకోసం వస్తారని నమ్మకంలేదు. ఎందుకంటే తన గురించి, తన వడ్డీ వ్యాపారం గురించి తెలిసినవాళ్లకు తనంటే ఎంత అసహ్యమో ఊహించవచ్చు. పైగా ఆ పార్వతీశంగాడి భార్య తన సంగతి అందరికీ చెప్పే వుంటుంది.

పోనీ పోలీసుల సహాయం యాచిద్దామంటే వాళ్లు తన ఇల్లుదాకా వచ్చేసరికి గంట పైగా పడుతుంది.

అప్పుడు హంతకుడిచ్చిన గడువులో పావుగంట పైగా గడిచిన విషయం గుర్తుకు రాగానే సుందర రామయ్య గుండె 'జట్ స్పీడ్'తో కొట్టుకోసాగింది.

అంతలో కిటికీలోంచి తళతళలాడుతు

న్న కత్తి ఒకటి విసురుగా సుందరరామయ్య కాళ్లముందు పడింది.

గజగజ వణికిపోయాడు.

ఎట్లాగో సత్తువ కూడగట్టుకుని కిటికీ దగ్గరికి పరుగెత్తాడు. బయట కారుచీకటి. వీధి దీపాలు కరెంటు లేనందువల్ల వెలగడం లేదు. ఎవరూ కన్పించలేదు.

కిటికీ తలుపులను పరిశీలించాడు. కిటికీ అద్దం పగలగొట్టుకుంటూ లోపలికి వచ్చింది ఆ కత్తి. మళ్లీ వెనక్కి వచ్చి కత్తిని పరిశీలించాడు.

కత్తికి ఏదో కాగితం చుట్టబడి వున్నది. దానిని కత్తినుంచి వేరుచేసి కొవ్వొత్తి వెలుగులో పరిశీలించాడు.

"రేయ్ సుందరరామయ్యా!

నువ్వు పాతికెకరాల ద్రాక్షతోట, అరడజను బంగళాలు, వ్యాపార కూడలిలో పది షాపులు ఎలా సంపాదించావో నీకంటే నాకు బాగా తెలుసు. పిల్లాజెల్లాలేనివాడివి. ఇంత సంపాదించి ఏం చేసుకుందామని?

అందరి నోళ్లు కొట్టబట్టే నీ భార్య, పిల్లలు అకాల మృత్యువు వాతపడ్డారు.

ఇప్పుడు నీకిచ్చిన అరగంట వ్యవధిలో పావుగంట అయిపోయింది. ఇంకొక్క పావుగంట. అంటే పదిహేను నిమిషాలు ఓపిక పట్టావంటే నీ భార్యాపిల్లల్ని కలుసుకుంటావు.

నీకెలాగూ చావు తప్పదు. పైన నీపెళ్లాం పిల్లలు నీ రాకకోసం ఎదురుచూస్తున్నారు. నువ్వు నాకోసం మరొక పావుగంట ఎదురు చూడు"

క్రింద సంతకంలేదు. ఉత్తరం పూర్తిగా చదివాడో లేదో చెమటలు పోశాయి.


అంతలో తలుపు తడ్తున్న శబ్దం అయింది. ఆ హంతకుడు అప్పుడే వచ్చాడా?... ఒక్క క్షణం అతని గుండె ఆగిపోయి మళ్లీ కొట్టుకోసాగింది.

"ఎవరూ" పెద్దగా అరిచాననుకున్నాడు

## లబ్ డబ్

మనిషి గుండె సరాసరి నిమిషానికి 69.72 సార్లు కొట్టుకుంటుంది. కానీ మొట్టమొదటిసారి చంద్ర మండలంపై కాలు పెట్టిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ గుండె నిమిషానికి 140–142సార్లు కొట్టుకుందిట.

— అచ్యుతుని రాజ్యశ్రీ



కాని అది విస్మ మూలుగులాగా వెలువడ్డది.

"నేను సీతాపతిని... తలుపు తీయండి మామయ్యా!" అది సీతాపతి కంఠమే!

అమ్మ బాబోయ్! తలుపు తీస్తే మీదపడి చంపేస్తాడు. తలుపు తీయకపోయినా తలుపులు విరగ్గొట్టి అయినా లోపలికి వస్తాడేమో! మంచి మాటలతో తప్పించుకోవాలి. ఎంతో కొంత వాడి ముఖాన కొడ్తే తనని వదిలిపోతాడేమో!

"నాయనా సీతాపతీ, నావల్ల నీకెంతో అన్యాయం జరిగింది. ఇప్పుడు నేను చాలా బాధపడ్తున్నాను. నీ ఆస్తి నీకే స్వాధీనం చేస్తాను. లేదా నీకు రెండు లక్షలు హార్డ్ క్యాష్ ఇస్తాను. నన్ను చంపకు" దీనంగా అన్నాడు సుందరరామయ్య.

అవతలివైపునుంచి సమాధానం రాలేదు.

"నాయనా సీతాపతీ! ఆ రెండు లక్షలూ కాక మరొక యాభై వేలు ఇస్తాను. నన్ను బ్రతకనీయి" మరొకమారు దీనంగా అర్థించాడు.

"ఊ... సరే. ముందు తలుపు తెరవండి" అన్నాడు సీతాపతి.

"తలుపు తెరవడం దేనికిలేబాబూ!" అంటూ రెండులక్షల యాభై వేలు గబగబా లెక్కపెట్టి, చిన్న బ్రీఫ్ కేసులో పెట్టి కిటికీగుండా అందించాడు.

"థాంక్స్" అంటూ దానిని అందుకుని "ఆ అన్నట్లు... తర్వాత నేను మీదగ్గర కాజేశానని కేసు పెడ్తారేమో! నేను బాకీగా ఇవ్వవలసిన రెండు లక్షలు, వాటికి అయిన వడ్డీ 50 వేలు ఇస్తున్నాను" అని వ్రాసి కాగితం ఇవ్వండి" అన్నాడు సీతాపతి.

గబగబా అతను చెప్పినట్లు వ్రాసి ఇచ్చి, చీకట్లో దూరమైపోతున్న సీతాపతిని చూస్తూ నిలబడిపోయాడు సుందరరామయ్య.

ఆ రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు సుందరరామయ్యకు. కలతనిద్రలో సీతాపతి పీకనులిమి చంపుతున్నట్లు ఒకటే కలలు.

తెల్లవారాకగాని సుందరరామయ్య గుండె కుదుటపడలేదు. అంతలో "అయ్యగారూ! ఎవరో సీతాపతిగారట. ఈ ఉత్తరం మీకిమ్మన్నారు" అంటూ ఒక కవరు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు ఆ కుర్రాడు.

గబగబా విప్పి చదివాడు సుందరరామయ్య.

"సుందరరామయ్యగారూ!

నిన్న నేను మీతో ఆఖరిసారిగా మా ఆస్తివ్యవహారాలు మాట్లాడదామని, అవసరమైతే కోర్టుకు వెళ్తానని చెబుదామని వచ్చాను. దావా గెలవడానికి అన్ని కాగితాలూ, ఇన్ఫర్మేషన్ సంపాదించి వుంచాను. రాత్రి వానవల్ల బస్సు దొరకక నడిచి వచ్చాను. కాగలకార్యం గంధర్వులు తీర్చారు అన్నట్లు నీ అంతట నువ్వే నిన్ను నేనేమైనా చేస్తాననే భయంతో నా ఆస్తి నా చేతిలో పెట్టావు. చాలా థాంక్స్. నేను హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. సీతాపతి"

ఆ ఉత్తరం చదివిన సుందరరామయ్యకు బుర్ర తిరిగిపోయింది.

"అయితే నన్ను చంపుతానని బెదిరించింది ఎవరు?" ఆలోచిస్తున్న సుందరరామయ్య ఫోన్ మ్రోగడంతో లేచి రిసీవర్

ఎత్తుకున్నాడు. అవతలివైపునుంచి సుందరరామయ్య స్నేహితుడు రాఘవరావు చెప్పుకుపోతున్నాడు.

"క్షమించాలి సుందరరామయ్యగారూ! నిన్న ఏప్రిల్ ఫస్ట్‌గదా అని చిన్న నాటకం ఆడాము నేనూ మా అబ్బాయి. నేను ఫోన్ చేశాను. మా అబ్బాయి ఉత్తరం రాసిన కత్తి విసిరి, వచ్చేశాడు. మొత్తానికి భయపడ్డట్టున్నారు" అంటూ ఇంకేమో చెప్తున్నాడు. సుందరరామయ్య చెవులకు ఇంకేమీ వినిపించలేదు.

○ ● ○

